www.prajasakti.com
ప్రజాశక్తి
5
బుధవారం 28 ఫిబ్రవరి 2024
వైఎస్ఆర్

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో డిసెంబర్‌లో నిర్వహించిన డిగ్రీ మూడు, నాలుగు సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసి ఆచార్య చింత సుధాకర్, కుల సచివులు ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి విశ్వవిద్యాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసి మాట్లాడుతూ డిగ్రీ బిఎ, బికాం, బిఎస్‌సి, బిబిఎ, బిసిఏ మూడో సెమిస్టర్ లో 64.38 శాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు. మొత్తం 5,062 మంది విద్యార్థులు పరీక్ష లు రాస్తే 3259 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. నాలుగు సెమిస్టర్ ఫలితాల్లో 8803 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 4989 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 56.67 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. త్వరితగతిన ఫలితాలు విడుదల చేసినందుకు పరీక్షల విభాగాన్ని వైస్ ఛాన్సలర్ అభినందించారు.

చీనీ రైతులు కుదేలు

- మార్కి వస్తున్నా పెరగని ధరలు..
- మరోవైపు పీడిస్తున్న తెగుళ్లు

మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న చీనీ కాయలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

తమ పరిస్థితి దయనీయంగా మారిందని చీనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, లింగాల, వేముల, పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం మండలాల్లో దాదాపు 20 వేల హెక్టార్లలో చీనీ పంట సాగులో ఉంది. ప్రతి ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమై జూన్, జూలై నాటికి ఏడారు, గైరంగాల చీనీకాయల కోతలు ముగుస్తాయి. ఈ సీజన్‌లో ప్రతిరోజు మార్కెట్లో 500 టన్నుల నుంచి 1000 టన్నుల వరకు విక్రయాలు జరుగుతాయి. అదేవిధంగా పులివెందుల మార్కెట్ స్థానికంగా తోటల వద్ద రైతులు మరో 500 టన్నుల కాయలను వ్యాపారస్తులు కొనుగోలు చేసి ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, నాగపూర్, హైదరాబాద్, బెంగళూరు, రాజస్థాన్ రాష్ట్రాలకు తరలించేవారు. అయితే ఈ ఏడాది ఎండలు అధికమైనప్పటికీ ధరలు మాత్రం పెరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి కష్టపడినా.. పంటకు దిగుబడి వచ్చే సమయంలో ధరలు లేకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గడచిన 20 రోజుల నుంచి పులివెందుల మార్కెట్లో టన్ను గరిష్టంగా రూ.18వేల నుంచి రూ.22 వేల లోపు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కాయలకు రవాణా, కోత కూలీలు, కమీషన్ అంతులోనే చెల్లించాల్సి ఉంది.

పులివెందుల మార్కెట్‌కు రాని కొత్త వ్యాపారులు..

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పులివెందులలో చీనీ కాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో సూటు, కమీషన్ లేకుండా చీనీ కాయల కొనుగోలు చేయాలని ఆశ్యంతో ప్రారంభించారు. ప్రారంభించిన కొద్ది రోజులకే అనివార్య కారణాలతో మూత వేశారు. మళ్లీ కొన్ని అనివార్య కారణాల వల్ల కమీషన్ ఆరు శాతం, తరుగు కింద టన్నుకు 20 కిలోలు తీసుకునేలా వ్యాపారస్తులకు అంగీకారంతో కొనుగోళ్లు పునఃప్రారంభించారు. అయితే మార్కెట్లో స్థానిక వ్యాపారులతోనే వ్యాపారాలు జరుగుతుండడంతో ఆశించిన స్థాయిలో ధరలు వేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ప్రముఖ కంపెనీలు, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారస్తులు రాకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారస్తులు, ప్రముఖ కంపెనీలు వస్తేనే మంచి ధరలు వచ్చే అవకాశం ఉందని, ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని చీనీ రైతులు కోరుతున్నారు.

మహారాష్ట్ర కాయల ప్రభావం..

మహారాష్ట్రలో ఈ ఏడాది చీనీ కాయలు దిగుబడి అధికంగా ఉందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ఈ కారణంగా మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి చీనీకాయల ఎగుమతి అధికంగా ఉన్నందున అనంతపురం మార్కెట్ సైతం పునఃప్రారంభం కాలేదు. ప్రతి ఏడాది ఇదే సమయంలో టన్ను రూ.35వేల నుంచి రూ.40 వేల వరకు ధరలు పలుకుతుండేవి. ఏడాది ధరలు పెరగక పోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తెగుళ్లతో మరోవైపు ఇబ్బందులు..

ఇటీవల కాలంలో చీనీ తోటలకు తెగుళ్ల అధికమయ్యాయి. వాటి నివారణకు క్రిమిసంహారక మందులు అధికంగా కొట్టాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా పులుసు పురుగు, బంక, వేరుకుళ్లు వంటి తెగుళ్ల కారణంగా చెట్లు నిల్వ నిలువునా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు చెల్లించి క్రిమి సంహారక మందులు వాడుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగినపెట్టుబడి..

ఇటీవల చీనీ తోటల సాగుకు పెట్టుబడి పెరిగింది. ముఖ్యంగా ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చు అధికమైంది. ఈ కారణంగా టన్ను చీనీ కాయలు రూ.40 వేల నుంచి రూ.50వేలు ఉంటేనే గిట్టుబాటయ్యే అవకాశం ఉంది. కావున ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలి.

- గంగాధర్‌రెడ్డి, చీనీ రైతు, గురజాల

టన్నుకు రూ.50 వేలు ఇవ్వాలి..

సూటు, కమీషన్ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చీనీ కాయలకు టన్నుకు రూ.50 వేలు తీసుకున్నప్పుడు రైతులకు గిట్టుబాటు అవుతుంది. ఇటీవల పంట సాగుకు వ్యయం పెరిగింది. కావున పులివెందుల మార్కెట్‌కు ప్రముఖ కంపెనీలను ఆహ్వానించి రైతులకు గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- జగన్మోహన్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు

బేవరేజ్ హమాలీలకు కూలి రేట్లు పెంచాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఎల్ డిపోలో పనిచేస్తున్న బేవరేజ్ హమాలీ కార్మికులకు ఎగుమతి రేట్లు గత అక్టోబర్‌లో పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, హామీని వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప ఐఎంఎల్ డిపో వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావడంలో ఎక్సైజ్ శాఖ ప్రధానమైనటువంటి ఆదాయ వనరు అని తెలిపారు. బేవరేజ్ హమాలీలు ట్రాన్స్‌పోర్టు వెహికల్స్ కు ఎగుమతి చేయడం, దిగుమతి చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఎక్సైజ్ శాఖ అధికారులు 2023, అక్టోబర్ చివరి లోపు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. మరల డిసెంబర్ 15వ తేదీ లోపు కచ్చితంగా పెంచుతామని చెప్పారన్నారు. 2024, ఫిబ్రవరి దాటినా ఎక్సైజ్ అధికారులు, ప్రభుత్వం పెంచకపోవడం వల్ల డిపోల వద్ద ధర్నా చేయాల్సిన అవసరం వచ్చిందని పేర్కొన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. ఐఎంఎల్ డిపో వద్ద హమాలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉంటారని చెప్పారు. బాటల్స్ దించడంలో, ఎత్తడంలో ప్రమాదం జరుగుతున్నటువంటి పరిస్థితి ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాద బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. హమాలీల ఎగుమతి రేట్లు పెంచకపోతే సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మార్చి 4 వ తేదీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఐఎంఎల్ బేవరేజ్ హమాలి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి.వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎక్సైజ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. డిపో గౌరవ అధ్యక్షులు పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ హమాలీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో కె. రఘురామయ్య, జి.రెడ్డి ప్రసాద్, ఎన్.వి. సుబ్బారెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, పి.వి.రమణ, పిఓ కొండారెడ్డి, ఎ.నరేష్, ఎన్. మదన్, ఎల్.మనోహర్ పాల్గొన్నారు.

హమాలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్

ప్రణాళికాబద్ధంగా సంసిద్ధం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రానున్న సార్వత్రిక, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా సంసిద్ధం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్‌లో జెసి గణేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషలతో కలిసిరానున్న ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణలు, మెటీరియల్, ట్రాన్స్‌పోర్ట్, పోస్టల్ బ్యాలెట్, స్వీప్ యాక్టివిటీస్, సి-విజిల్, ఇవిఎం మేనేజ్‌మెంట్‌లతో పాటు ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్, ఎంసిఎంసి తదితర అంశాల నిర్వహణ విషయంలో నోడల్ అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే క్రమ శిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అందుకు ముమ్మరంగా స్వీప్ యాక్టివిటీస్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ నెల చివరి నాటికి జిల్లాలోని అన్నీ పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బద్వేల్ ఆర్‌డిఒ రమణ, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, ఎస్ ఎస్ఎ పిఒ డాక్టర్ ఎ. ప్రభాకర్‌రెడ్డి, బిసి కార్పొరేషన్ ఇడి డాక్టర్ బ్రహ్మయ్య, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్, ఇతర నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయ్‌రామరాజు

జానమద్ది చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బహుముఖ ప్రజ్ఞాశాలి 'జానమద్ది'

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రముఖ కవి, రచయిత జానమద్ది హనుమచ్ఛాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మునిరావువీధిలోని కొండూరు పిచ్చమ్మ వెంకట రాజు స్మారక సంస్థ కార్యాలయంలో జానమద్ది 10వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ హనుమచ్ఛాస్త్రిలాంటి గొప్ప వ్యక్తులు జిల్లాకే గర్వకారణమన్నారు. పుట్టపర్తి, హనుమచ్ఛాస్త్రిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. స్మారక సంస్థ అధ్యక్షులు కొండూరు జనార్దన రాజు మాట్లాడుతూ గతంలో తన స్వంత ఖర్చులతో అనేక సాహితీ కార్యక్రమాలు చేసేవారన్నారు. హనుమచ్ఛాస్త్రి తనకు గురువులాంటి వారని పేర్కొన్నారు. అనంతరం శాస్త్రి కుమారుడు జానమద్ది నాగరాజు మాట్లాడుతూ తమ తండ్రి ఉపాధ్యాయవృత్తిలో ఉన్నప్పుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను అభిమానించేవారని పేర్కొన్నారు. తాను చిన్న వయస్సులో ఉన్నప్పుడు జిల్లా అధికారులతో పాటు సినిమారంగానికి చెందిన ప్రముఖ సాహితీవేత్తలు నటులు వచ్చేవారని తెలిపారు. గతంలో గవర్నరుగా పనిచేసిన సుశీల్‌కుమార్ షిండే కడపకు వచ్చినప్పుడు తమ తండ్రి జానమద్ది హనుమచ్ఛాస్త్రి దేవుని కడపలో ఉన్న వెంకటేశ్వర ఆలయాన్ని సందర్శించడం జరిగిందన్నారు. చివరివరకూ పుస్తకాలు రాస్తూనే ఉండేవారని కొనియాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చిల్లారి రెడ్డెయ్య రాజు, గొబ్బూరి కోటేశ్వరరావు, డేవిడ్, సతీష్, జ్యోతి జార్జి, ఫణి పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-కలసపాడు

ప్రతి విద్యార్థీ శాస్త్రవేత్తగా ఎదగాలని ఎస్ఐ నాగమురళి పేర్కొన్నారు. మండలంలోని స్థానిక సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో నేషనల్ సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై సైన్స్ ఫెయిర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ వల్ల విద్యార్థి మేథోశక్తి పెరుగుతుందని చెప్పారు. మన చుట్టూ ఉన్న పరిసరాలు ఎంతగానో ఉపయో గపడుతారన్నారు. ప్రతి విద్యార్థి సర్ సి.వి. రామన్‌ను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలు కావాలని పేర్కొన్నారు. అనంతరం తన బాల్య జీవితాన్ని విద్యార్థులకు గుర్తుచేసి, క్రమశిక్షణ పట్టుదల ఉంటే ఏదైనా సాధించ వచ్చని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్, చైర్మన్ చిత్తా బాల్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ చిత్త రాజశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు చిత్త ప్రభావతి, ఎంఇఒ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ నాగమురళి

బస్సులపై ఉర్దూ భాషలో బోర్డులు రాయించాలి

కడప అర్బన్ : ఎపిఎస్ ఆర్‌టిసి బస్సులపై ఉర్దూ భాషలో బోర్డులు రాయించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్ , రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసీవుల్లా బక్తియారి సాహెబ్ కడప క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మంగళవారం ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జున రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల మంది మాతృభాష ఉర్దూ కలిగి ఉన్నారని, వారందరిని దృష్టిలో ఉంచుకుని బస్సులన్నింటిపై ఉర్దూ భాషలో బోర్డులు రాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రాష్ట్ర కన్వీనర్ షాబుద్దీన్, నగర కార్యదర్శి హీఫాజతుల్లా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి - కడప

శిక్షణలో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

నూతనంగా నియమించబడిన పారా లీగల్ వాలంటీర్లకు చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం వివిధ చట్టాల పట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ ఉద్దేశ్యం, పారా లీగల్ వాల ంటీర్ల పాత్ర, పారా లీగల్ వాలంటీర్ల డ్రెస్ కోడ్, ప్రవర్తనా ప్రమాణాలు, నీతి, న్యాయ సేవల అధికార చట్టం, 1987 అవగాహన కల్పించడమేనని చెప్పారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌లలో పారా లీగల్ వాలంటీర్లు విధులు నిర్వహిస్తూ ప్రజలు ఏవైనా అర్జీలు సమర్పిస్తే వాటిని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయ వాదులకు ఇవ్వాలన్నారు. వాటిని సెక్రెటరీ కం సీనియర్ సివిల్ జడ్జి పరిశీలించి చర్యలు తీసు కుంటారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ న్యాయవాదులు పాల్గొన్నారు. **క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి..** పిల్లల పట్ల ఎప్పటికప్పుడూ జాగ్రత్తలు వహించాలని సంబంధిత అధికారులను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆదేశించారు. మంగళవారం జడ్జి ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహాలను సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. పిల్లల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్త వహించాలని ఆదేశించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారిని సంప్రదించవచ్చును అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వసతి గృహం సూపరింటెండెంట్, పిల్లలు పాల్గొన్నారు.

బిపిఎస్ పాఠశాల విద్యార్థుల అరుదైన ఘనత

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలోని బద్వేల్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్యంలో అరుదైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సౌత్ ఇండియన్ ఆర్ట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు ముఖ్య అతిథులుగా పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ గోపాల కృష్ణయ్య, సంజీవని మల్టీ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ సుమన్, షుగర్ వ్యాధి వైద్యులు సరస్వతి, బద్వేల్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు క్రాంతి కుమార్, భరతనాట్యం కూచిపూడి నాట్య గురువులు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సౌత్ ఇండియన్ ఆర్ట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు పంపిన ప్రశంసా పత్రాలు, మెమెంటో షీల్డ్ లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 26న తెలంగాణ రాష్ట్రంలో కూచిపూడి మహాబృందనాట్యంలో శివ పంచాక్షరికి ఒకేసారి 300 మంది నాట్య కళాకారులు కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి 8 మంది బద్వేల్ నుంచి పాల్గొనగా అందులో వెంకట సహస్ర, ప్రణవి, మనస్విని మన పాఠశాలకు చెందిన వారు కావడం గర్వంగా ఉందని, పాఠశాల ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఇంతటి ఘన విజయాన్ని సాధించినందుకు వ్యవస్థాపకులను, నాట్య గురువులు సతీష్ ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

బి. కోడూరు : ప్రతిఒక్కరూ ఆరోగ్య సురక్షణను సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపిడిఒ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలపల్లిలో గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. హాజరైన వారికి ఆరోగ్య పరీక్షలు చేసిన ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని ప్రతి పేద కుటుంబం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వినీత్ రాజు, డాక్టర్ ఉదయ్ కిరణ్, మండల వైసిపి కన్వీనర్ లక్ష్మి రెడ్డి, బి కోడూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది, సచివాలయం, ఆశా ఆరోగ్య మిత్ర సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్‌జిఒల సేవలు మరువలేనివి

కడప : నిస్వార్థంగా సేవలు చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు మరువలేనివి అని స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ అన్నారు. కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో వరల్డ్ ఎన్‌జిఒ డే వేడులకు మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేస్తుండడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. వారికి తమ శాఖ తరుపున ఏవైనా అవకాశాలు ఉంటే, తప్పక తెలియజేస్తామని తెలిపారు. నగరంలో సేవలు చేస్తున్న 30 మంది ఎన్‌జిఒలను మోమెంటో షీల్డ్‌తో సన్మానించారు. కార్యక్రమంలో స్టెప్ సిబ్బంది, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణు వర్ధన్, నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ శ్రీనివాస రెడ్డి, ఎన్‌జిఒలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం మార్చడం శోచనీయం

కడప అర్బన్ : దశాబ్దాలుగా చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సి. పరీక్ష కేంద్రం కొనసాగుతూ ఉన్నప్పటికీ, ఇప్పుడు ప్రయివేట్ పాఠశాలలైన చైతన్య స్కూల్స్‌లో ఏర్పాటు చేయడం శోచనీయమని ఎస్‌టియు నాయకులు అన్నారు. మంగళవారం డిఇఒ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫర్నిచర్ లేదన్న సాకుతో పరీక్ష కేంద్రాన్ని మార్చడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం నాడు - నేడు పథకం కిందట మండలంలోని పలు పాఠశాలలకు డెస్కులు ఏర్పాటు చేసిందన్నారు. చింతకొమ్మదిన్నె మండల విద్యాశాఖ అధికారి ఈ విషయంలో పరోక్షంగా తన వంతు పాత్ర పోషించారని అనుమానించాల్సి వస్తోందని చెప్పారు. ఈ విషయమై తగిన చర్య తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్‌టియు స్టేట్ అసోసియేట్ కె.సురేష్ బాబు, ఉపాధ్యక్షులు కె.బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు యస్. ఇలియాస్ బాష, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సంగమేశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు పి.సుదర్శన్ రెడ్డి, జగన్, గంగాధర్ పాల్గొన్నారు.

టిడిపి బ్యానర్లు చించివేయడం సరికాదు

కడప అర్బన్ : టిడిపి కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిరెడ్డి 32,34,35 డివిజన్‌లలో టిడిపి కార్యకర్తలు బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే స్థానిక కార్పొరేటర్ షంషేర్, ఆయన అనుచరులు చించివేయడం సమంజసం కాదని టిడిపి నాయకులు చెన్నంశెట్టి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే వైసిపి నేతల ఇళ్లపై టిడిపి జెండాలు ఎగురవేస్తామని హెచ్చరించారు. మాధవిరెడ్డి ప్రచారాన్ని తట్టుకోలేక వైసిపి నాయకులు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని చెప్పారు. నోరు అదుపులో పెట్టుకో కపోతే మాట్లాడిన వారి ఇళ్లముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా నాగార్జున మోడల్ స్కూల్ వార్షికోత్సవం

కడప అర్బన్ : నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్ రామారాజుపల్లె బ్రాంచ్‌లో ఉల్లాసంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. యుఫోరియా-2024 పేరుతో వేడుకలు చేసుకున్నారు. విద్యాసంస్థల చైర్మన్ ఎం.శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. పాఠశాల నివేదికను విన్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా వికాసంతో పాటు సమాజ వికాసానికి అవసరమైన వసతులు కల్పించామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఆత్యాధునికి బోధనాపద్ధతులను అనుసరిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా శిక్షణనిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి వార్షికోత్సవం లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల వికాసానికి కృషి చేస్తున్నామన్నారు. బచ్‌పన్ ప్లే స్కూల్‌లో కిండర్‌గార్డెన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు కాన్వోకేషన్ పట్టాలను చైర్మన్, డైరెక్టర్ శ్రీదేవి అంద జేశారు. వివిధ క్రీడాపోటీలలో ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణవేణి, రామరాజుపల్లె బ్రాంచ్ ప్రిన్సిపల్ అరుణ, హెచ్‌ఎం వీరశివ, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కాన్వొకేషన్‌ను ప్రదానం చేస్తున్న చైర్మన్, డైరెక్టర్

జిల్లా అభివృద్ధిపై చర్చకు సిద్ధం

కడప అర్బన్ : చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి ఏమి చేశారని జగన్ వ్యాఖ్యానిస్తున్నారని, అసలు జిల్లా వాసిగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లాకు ఏమి చేశారని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు జగన్ చేసిన అభివృద్ధి జీరోగా నిరూపించేందుకు చర్చకు తాను సిద్ధమని ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి జిల్లా వైసిపి ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. ద్వారకా నగర్ లోని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదికి పది ఎమ్మెల్యేలు, రెండు ఎంపీలు, స్థానిక సంస్థల్లో బెదిరించి, ఏకగ్రీవాలై ఏమి అభివృద్ధి చేశారని నిలదీశారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదు, ఉపాధి చూపలేదన్నారు. ఉక్కు ఊసే లేదని, ఒక్క పరిశ్రమ తీసుకు వచ్చింది లేదన్నారు. షుగర్ ఫ్యాక్టరీ తెరుచుకోలేదని, పాల కేంద్రం పడకేసిందని చెప్పారు. కరువు మండలాలను పట్టించుకోలేదని, గండికోట, మైలవరం ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా, రైతాంగానికి నీరిచ్చారా అని జిల్లా శాసనసభ్యులను నిలదీశారు. అన్నమయ్య ప్రాజెక్టు నీటి విడుదల గేటుకు ఇప్పటివరకు మరమ్మతులు చేయని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. పరిపాలన సమర్థుడు చంద్రబాబు అయితే, దుర్మార్గపు పాలనకు జగన్ సమర్థుడని విమర్శించారు. జిల్లా ప్రజలు ఒక్కసారి టిడిపికి అవకాశమిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామన్నారు.

నేడు ఉద్యోగమేళా

కడప : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈనెల 28న దయం 10:00 గంటలకు ప్రముఖ కంపెనీలతో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ప్రముఖ కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేసేందుకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ ఏదైనా పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసి, 18-35 సంవత్సరాల వయసులోపు అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొనేందుకు అర్హులు అని తెలిపారు. విద్యార్హత పత్రాలు ఫొటోలు తీసుకొని హాజరుకావాలని కోరారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప అర్బన్ : పాఠశాల విద్య ఎఫ్ఎ - 4 పరీక్షలలో 8వ తరగతి సోషల్ పేపర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ని అవమాన పరుస్తూ దళిత నాయకుడుగా ముద్రించి ప్రశ్న పత్రాన్ని రూపకల్పన చేసిన వారి పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బిటిఎ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతి రామచంద్ర బాబు డాక్టర్ హరి కొండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్ ఎ - 4 పరీక్షలలో ఈనెల 26న జరిగిన 8 వ తరగతి సోషల్ ప్రశ్న పత్రంలో 5 వ ప్రశ్న ' దళిత ఉద్యమ నాయకుడు ఎవరు' అనే ప్రశ్న ఇచ్చి దానికి జవాబుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌గా రూపొందించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పాఠ్యాంశాలలోనూ దళిత నాయకుడుగా ముద్రించడాన్ని తొలగించాలని చెప్పారు.

స్వామినాథన్ కమిషన్‌ను అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప

స్వామినాథన్ కమిటీ రిపోర్టును వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి జకరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, కడప నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరి ప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రముఖ శాస్త్రవేత్త స్వామి నాథన్ రైతుల పెట్టుబడి, దిగుబడి ఖర్చులు, ప్రకృతి వైపరీత్యాలు, మద్దతు ధర, గిట్టుబాటు ధర, రైతు శ్రమ తదితరాలపై రైతాంగ సమస్యలపై స్వామినాథన్ అధ్యయనం చేసి కమిటీ రిపోర్ట్ ఇచ్చారు అని అన్నారు. స్వామినాథన్ కమిటీ రిపోర్టును అమలు చేయాలని వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తూ 2018 నుండి పలు రకాల ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా 365 రోజులు ఢిల్లీలో ఆందోళన నిర్వహించారు అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే స్వామినాథన్ కమిటీ రిపోర్ట్ అమలు చేస్తామని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న బండి జకరయ్య

పుట్టా సుధాకర్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ముస్లిం నాయకులు

'పుట్టా'ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌ను రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ముస్లింలు తెలిపారు. పార్టీ అధిష్టానం మైదుకూరు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించడంపై ముస్లిం మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కమలాపురం ఫరూక్ ఆధ్వర్యంలో ముస్లింలు మంగళవారం ప్రొద్దుటూరులోని పుట్టా సుధాకర్ యాదవ్‌ను తన నివాసంలో కలిసి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కె.ఎస్.నూరుల్లా, కొత్తపల్లె ఖాజా మొహిద్దీన్, కె.ఎస్.షఫీఉల్లా, కె.ఎం.డి.డాక్టర్ హసీఫ్, బాషా పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం వల్ల జిల్లాకు ఒరిగిందేమీలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జగన్ పాలనలో జిల్లాకు ఒరిగిందేమీలేదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రులు తమతమ జిల్లాలో, ప్రాంతంలో అభివృద్ధి పనులు చేస్తారని, నిరుద్యోగిత తగ్గిస్తారని, ఫ్యాక్టరీలు, కంపెనీలు స్థాపిస్తారని తెలిపారు. రాయలసీమకు జగన్ చేసింది శూన్యమన్నారు. సాగునీటి రంగంలో దేశస్థాయి విద్యాసంస్థలు నెలకొల్పడంలో కడప జిల్లా పూర్తిస్థాయి నిర్లక్ష్యానికి గురైందన్నారు. ముఖ్యమంత్రి ఉన్నా కూడా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. రైల్వే లైన్, కోచ్ ఫ్యాక్టరీ విషయాల్లో నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. క్రిష్ణా రివర్ మానేజ్‌మెంట్ బోర్డ్ కడపలో పెట్టాలని మొత్తుకుంటున్నా విశాఖకు తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు. కడప ఉక్కు కథ ఏమిటో చెప్పాలన్నారు. కడప జిల్లా మీద నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు తిరగబడుట తప్పదని ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు.

శ్రీరంగనాథుని కల్యాణం.. కమనీయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పూలంగళ్ల సమీపంలో ఉన్న శ్రీరంగనాథ స్వామి కాంప్లెక్స్‌లో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాయక స్వామి కల్యాణాన్ని మంగళవారం కమనీయంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ఇఒ రమణ, చల్లా వంశీయుల ఆధ్వర్యంలో పురోహితులు కృష్ణరాజేశ్ శర్మ చేతులు మీదుగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రంగనాథుడి నామస్మరణంతో కన్నులపండువగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. బుధవారం స్వామివారి రథోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొట్టిపాటి మాధవాచారి పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు ఆహ్వాన రథయాత్ర

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల కేంద్రంలో మార్చి 8న మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ప్రతిపల్లెకు రథయాత్ర కొనసాగుతున్నట్లు శ్రీ వెంకటేశ్వర స్వామి, వీరభద్ర స్వామి దేవస్థానం చైర్మన్ మోపురి రామాంజనేయరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 92 గ్రామాలు ప్రతి గ్రామానికి వెళ్లి శ్రీదేవి భూదేవితోపాటు వెంకటేశ్వర స్వామి లక్ష్మీదేవి స్వామి ఉత్సవ విగ్రహాలతో రథయాత్ర కొనసాగనుంది. కార్యక్రమంలో మాజీ చైర్మన్లు చక్రపాణిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, దేవస్థాన కమిటీ సభ్యులు యోగేశ్వర్‌రెడ్డి, పెంచలయ్య, సోమల ఈశ్వరయ్య, ఓబులేసు, నరసింహులు, తీసి గంగిరెడ్డి, అమర్ స్వామి పాల్గొన్నారు.

శివచంద్రారెడ్డి టిడిపి వైపు చూస్తున్నారు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఇంతకాలం వైసిపిలో కొనసాగి, ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకళ్లను విమర్శించే ముందు టిడిపి తీర్థం పుచ్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయాలేదా అన్నది స్పష్టం చేయాలన్నారు. తాను ఐపి పెట్టి హైదరాబాద్‌కు పారిపోయాను అని కొనిరెడ్డి చెప్పడం శుద్ధ అబద్ధమన్నారు. తన పూర్వీకులకు 300 ఎకరాలు ఉండేదని దానధర్మాలు, వ్యాపారాల్లో నష్టపోయామన్నారు. ఇక్కడ అప్పులు చెల్లించి వ్యాపారార్థం రూ.3.80లక్షలతో హైదరాబాద్‌కు వెళ్లి మాజీ మంత్రి డిఎల్ సహకారంలో హెూటల్ వ్యాపారం చేశానన్నారు. అంచెలంచెలుగా ఎదిగి పిల్లలు ప్రయోజకులై ప్రస్తుతం ఉద్యోగాల ద్వారా నెలకు రూ.15లక్షలు సంపాదిస్తున్నారన్నారు. శివచంద్రారెడ్డి అన్న దివంగత నేత వైఎస్ కుటుంబం కోసం హత్యకు గురయ్యాడన్నది అబద్ధమని, ఒక సందర్భంలో నోరుజారినందున హత్యకు గురయ్యాడన్నారు. కొనిరెడ్డి అన్నకొడుకు ప్రస్తుతం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా సహకారం అందించడంలేదన్నారు. కొనిరెడ్డి సర్పంచ్ అయ్యేందుకు ఎమ్మెల్యే రాచమల్లు ఎంతో కృషి చేశారన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా రాచమల్లు ప్రసాదరెడ్డిని ఎంపీ అవినాష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్ ప్రకటించినా కూడా అధిష్టానం ప్రకటించలేదనడం కొనిరెడ్డి అవివేకానికి నిదర్శనమన్నారు. వాణిజ్యశాఖలో అక్రమ వే బిల్లుల ద్వారా కొనిరెడ్డి ప్రభుత్వాలను మోసం చేశాడని ఆరోపించారు. ప్రస్తుతం ఈ విషయం విచారణలో ఉందన్నారు. సమావేశంలో పగిడాల దస్తగిరి పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక మెయిన్ బజార్‌లో జరుగుతున్న బోలె వార్డు పనులను మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి, కమిషనర్ రమణారెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో వేసిన డ్రయినేజీ, జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రయినేజీ మ్యాన్‌హోల్స్ హెచ్చుతగ్గులు లేకుండా రోడ్డుకు సమానంగా ఉండేలా చూడాలన్నారు.

అండర్ రోడ్డు వేయాలని గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ గడ్డమాలవాడ వెలుపల నిర్మాణంలో ఉన్న బైపాస్ హైవే నుండి తమ పొలాలకు వెళ్లేందుకు అండర్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తుల రోడ్డు పనులు చేయకుండా మంగళవారం అడ్డుకున్నారు. రహదారికి అటు వైపున తమ పొలాలు ఉన్నాయని రోడ్డు అడ్డుగా వేయడం వల్ల పొలాలకు వెళ్లేందుకు అవకాశం ఉండదని తెలిపారు. తాము వ్యవసాయం చేసుకునేందుకు ఏ విధంగా వెళ్లాలో చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు రోడ్డు వేస్తామని హామీ ఇచ్చిన తర్వాత పనులు చేపట్టాలని అడ్డుకున్నారు. ఉన్నత అధికారులు స్పందించాలని వారు కోరారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గం వైపు నడవాలి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల పట్ల, తన భార్య, పిల్లల పట్ల సద్భావనతో మెలిగి దేవుని ఆజ్ఞను శిరస్సు వహించి, సన్మార్గం వైపు నడవాలని ప్రముఖ ధార్మికవేత్త హాఫీజ్ మహమ్మద్ యాకూబ్ జామయి తెలిపారు. మంగళవారం స్థానిక మస్జీదే కూబాలో ఏర్పాటు చేసిన ధార్మిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖురాన్‌లో మానవ జీవనానికి మార్గనిర్దేశకాలైన ఎన్నో విషయాలు పొందపరిచారని తెలిపారు. వీటిని ఆచరించడం ద్వారా క్రమశిక్షణ, దైవస్మరణ, విధేయత, ఆరోగ్యపరమైన జీవనం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తోటి వారితో సోదరభావంతో మెలగాలన్నారు. అప్పుడే సమాజ సంస్కరణ సాధ్యపడుతుందన్నారు. పేదల పట్ల సానుభూతి, ఉన్నదాంతోనే సంతృప్తి చెందడం, ముహమ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో అబుహురైరా మదని, హనీఫ్ మదని, అబ్దుల్ రహమాన్, బసీర్ అహ్మద్ జామయి, మసీదు కమిటీ సభ్యులు, యువత పాల్గొన్నారు.

అసంపూర్తిగా మురుగు కాలువ నిర్మాణం

రోడ్డుపైకి మురుగునీరు - దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు - అడ్డంగా ముళ్లచెట్లు, దిమ్మెలు

అసంపూర్తిగా వదిలేసిన మురుగు కాలువ, రోడ్డు వెంబడి ముళ్లచెట్లు, దిమ్మెలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక పురపాలక పరిధిలోని వలసపల్లి రాస్తాలో చేపట్టిన మురుగుకాలువ పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. ఈ కారణంగా దర్గా సమీపంలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్వాసన కంపుకొడుతోంది. దీంతో వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు రూ. 2.5 కోట్లతో పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి వలసపల్లి రోడ్డులోని వంక వరకు రోడ్డు, కాలువ నిర్మాణం చేపట్టారు. కానీ మురుగు కాలువను వంకలో కలపకుండానే అసంపూర్తిగా పనులు ఆపడంతో, మురుగునీరు ఎటూ వెళ్లలేక రోడ్లపైనే నిల్వ ఉంటోంది. ఈ రస్తా గుండా వలసపల్లి, తుమ్మలపల్లి గ్రామాల ప్రజలు, జువారి కర్మాగార ఉద్యోగులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దుర్వాసనకు తోడు ముళ్ళపొదలు రోడ్డు వెంబడి ఏపుగా పెరగడం, రోడ్డును రోడ్డు సగభాగం వరకు కప్పేయడంతో ప్రయాణికులను ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గమనించక ముల్ల పొదల వైపు ద్విచక్ర వాహనాలను నడిపితే కళ్ళకు తగిలే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. కాలువపై వేసే దిమ్మెలను రోడ్డుకు అడ్డంగా అధికారులు వదిలేశారని, రాత్రివేళల్లో వాహనచోదకులు గమనించక దిమ్మెలను ఢీకొట్టే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా గుర్తించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా వాటిని తొలగించాలని, మురుగు నీరు రోడ్ల వెంబడి ప్రవహిం చకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

వేసవిలో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

మాట్లాడుతున్న జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రత్యేకదృష్టి పెట్టాలని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమీపంలోని వైఎస్ఆర్ సభా భవనంలో ఎంపిపి లక్ష్మిగాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లాడుతూ తాగునీటి విద్యుత్ మోటర్లుకు రిపేర్లు ఉంటే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు వెంటనే పనులు చేయించాలని కోరారు. ఎంఇఒ స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ విద్య వ్యవస్థలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాలలో తాగునీరు లేదని ఎంపిటిసిలు సభ దృష్టికి తెచ్చారు. ఆర్ఒ ప్లాంట్లు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులు చేయడానికి ముందుకు రావడం లేదని జడ్‌పిటిసి పేర్కొన్నారు. జగనన్న పాల వెల్లువ కింద 13 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎపిఎం బాలస్వామి తెలిపారు. ఆసరా కింద 60 శాతం మందికి నిధులు బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల నుండి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు ఐసిడిఎస్ అధికారి సునీత చెప్పారు. పౌష్టికాహారం పంపిణీ చేసే సమయంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో ఇవ్వాలని ఎంపిటిసిలు కోరారు. బక్కన్నగారిపల్లెలో ఎస్సీ కాలనీలో వీధిలైట్లుకు కనెక్షన్లు ఇవ్వలేదని సర్పంచ్ మల్లయ్య చెప్పారు. జగనన్న కాలనీలో దరఖాస్తులు చేసిన లబ్ధిదారులకు అందరికి విద్యుత్ మీటర్లు ఇస్తున్నట్లు జెఇలు శివ, దినేష్ చెప్పారు. వైఎస్ మదీనాపురంలో మసీదుపైన పోతున్న లైన్ మార్చాలని కోరామని ఇంత వరకు పట్టించుకోలేదని ఎంపిటిసి ఖాన్ పేర్కొన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ వెనుక వైపు వీధిలో కూడా విద్యుత్ లైన్ కిందకు ఉన్నాయని వాటిని మార్చాలని మణిగోపాల్‌రెడ్డి అధికారులను కోరారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు రూ.3 కోట్ల 56 లక్షల పేమెంట్ పెండింగ్‌లో ఉన్నట్లు ప్రజాప్రతినిధుల దృష్టికి ఉపాధి సిబ్బంది తీసుకొచ్చారు. పిఆర్ శాఖ పరిధిలో పనులు చేసిన వాటికి బిల్లులు కాక చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజాప్రతినిధులు వాపోయారు. వేంపల్లె పంచాయతీ పరిధిలో చేసిన పనులకు మూడేళ్లవుతున్నా ఇంకా బిల్లులు మంజూరు కాలేదని ఎంపిటిసి కటిక చంద్రశేఖర్ చెప్పారు. కార్యక్రమం ఇఒపిఆర్డి మల్లికార్జునరెడ్డి, ఎంపిటిసిలు భారతి, పద్మా జయలక్ష్మిదేవి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రహంతుల్లా ఖాన్, బ్రహ్మయ్య, ఎంహెచ్ హబీబ్, సర్పంచులు మునయ్య, మల్లయ్య, డాక్టర్ స్వాతిసాయి, ఇన్‌ఛార్జి హౌసింగ్ ఎఇ ఒసూరప్ప, మధు ప్రభాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ఇంటింటికి శంఖారావం కిట్లు పంపిణీ చేస్తున్న భూపేష్

ప్రజాశక్తి - ముద్దనూరు

రాష్ట్ర సంక్షేమం కోసం టిడిపి అమలు చేసే మేనిఫెస్టోను ప్రతిరోజూ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జమ్మలమడుగు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం భూపేష్ ఆధ్వర్యంలో ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల మండలాల క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌ఛార్జిలకు ఇంటింటికి శంఖారావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ బాబుష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త టిడిపి గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం టిడిపి ఇంటింటికి శంఖారావం కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు రంగారెడ్డి, టిడిపి నాయకులు రాజశేఖర్ యాదవ్, సత్తార్, సాయి, రామ కృష్ణారెడ్డి, చిన్న మాబు, బాబా అమీర్ పాల్గొన్నారు.

ప్రతి బూత్‌లో మెజార్టీ మన లక్ష్యం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ బూత్‌లోనూ టిడివి, జనసేన మెజారిటీ ఓట్లే మన లక్ష్యమని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలతో శంఖారావం డోర్ టు డోర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ మహానాడులో జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మినీ మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేలా ఆరు పథకాలను పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జనసేన జమ్మలమడుగు కో-ఆర్డినేటర్ నల్లంసెట్టి నాగార్జున, టిడిపి, జనసేన, నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి టిడిపి కృషి : బిటెక్ రవి

వేంపల్లె : బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న పార్టీ తెలుగుదేశమేనని పులివెందుల టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలోని బిడ్డాలమిట్ట ప్రాంతంలో మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, అబ్దుల్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రవి, ఆయన సతీమణి లతారెడ్డి ఇంటింటికి తిరిగి టిడిపి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. వైసిపి నుండి టిడిపిలో చేరిన మాజీ ఎంపిటిసి ఫాతిమా కుటుంబ సభ్యులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, జనసేనా పులివెందుల ఇన్‌ఛార్జి హరిష్, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, ఎస్సీ జయ చంద్రారెడ్డి, డివి సుబ్బారెడ్డి, అబ్దుల్, మహమ్మద్ ఇనాయతుల్లా, పీరా సాహెబ్, జబిబుల్లా, మడక శ్రీనివాసులు, వేమకుమార్, డక్కా రమేష్, పాపిరెడ్డి, గొటూరు నాగభూషణం, కత్తులూరు నాగసుబ్బయ్య, కత్తులూరు మల్లి కార్జున, ఈశ్వరయ్య, రామాంజనేయురెడ్డి (చంటి), రామగంగిరెడ్డి, వెల్డింగ్ బాషా, గోగుల మల్లికార్జున, మేస్త్రీ రమణ, రెడ్డి కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏసుదాసు

'అధికార పార్టీవారికే పట్టాలవుతున్నాయి'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అధికార పార్టీ నాయకులకు ప్రభుత్వ భూములనే అధికారులు పట్టా భూములుగా మారుస్తున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు అన్నారు. మంగళవారం స్థానిక మాస్టర్ పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాల కాలం నుండి ప్రజల తరపున పోరాటాలు చేస్తూ పేదవారికి ప్రభుత్వ భూమిని పంచాలని అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దతీసుకువెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుత నిత్యవసరల ధరలు చూస్తే పేద, మధ్య తరగతి ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. బియ్యం బస్తా 50 కిలోలు రూ.3500 నుండి రూ.4000 వరకు ఉందన్నారు. ఈ పరిస్థితి రావడానికి ప్రభుత్వాల తప్పిదమే ప్రధాన కారణమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు భూ పంపిణీ చేసి ఉంటే ప్రజలకు ఇన్ని సమస్యలు వచ్చేవి కావన్నారు. ప్రస్తుతం భూమి ఉన్నవారు అనేక కారణాలచే భూములను అమ్మడం జరుగుతోందన్నారు. పండించే వారికి, శ్రమజీవులకు, రైతు కూలీలకు భూమిని పంచి ప్రజల అవసరాలు తీర్చాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. అనేక సర్వే నెంబర్లలో కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలని కోరారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి భూమిని పంచాలని కోరారు. కార్యక్రమంలో దాసరి విజయ్, ఆంజనేయులు, దివాకర్, అభిలాష పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అమృత్ నగర్ సమస్యల పరిష్కారానికి తామంతా ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్ వేస్తామని లబ్ధిదారులు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా మంగళవారానికి 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించలేని నాయకులు ఎందుకని.. వారికి వ్యతిరేకంగా ప్రతి లబ్ధిదారుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయాలని తీర్మానించామన్నారు. 15ఏళ్ల క్రితం అమృత్ నగర్‌లో పట్టాలిచ్చి మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారని తెలిపారు. కబ్జాదారులపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. హసీనా, పుష్పలత, మల్లికా, భాను, గోవిందమ్మ, శంషాద్, షకీలా, మధు, హరి, నరసింహుడు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

కడప జిల్లా వేంపల్లె గ్రామంలోని శ్రీ చైతన్య స్కూల్ వీధిలోని 13/349-L18లో నివాసం ఉంటున్న రామిరెడ్డి పుష్పలత H/o మదన్ మోహన్ కి (L7009822) చెందిన పాసు పోర్ట్ పోయింది. నా పాసు పోర్టు తీసుకొని ఇంటి నుండి వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో జిరాక్స్‌కు వెళ్లుతుండగా కింద పడి పోయింది. ఎవరికైనా దొరికినచో ఈ అడ్రస్‌కు ఇవ్వాలి. **8608785555 నెంబర్‌కు ఫోన్ చేయాలి.**

శ్రీ రామాలయం

కత్తులూరు గ్రామం, వేంపల్లె మండలం, కడప జిల్లా.

e-Procurement Tender

NIT NO. P/COE/1516/2023 Dt: 06.02.2024

దేవాలయ పున: నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు : **ధర్మకర్త**

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్

E.P.No.54/2022 in O.S.No.256/2005

1. బైరిక బసమ్మ, భర్త లేట్ హుస్సైన్ రెడ్డి,
2. అయ్యులూరు వురుఫ్ బైరిక నాగ మహేశ్వర రెడ్డి, దత్తు తల్లి బైరిక బసమ్మ, కాంట్రాక్ట్ ఉద్యోగము, ఇద్దరు చాబోలు గ్రామము, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా. ...D.Hrs

-VS-

అయ్యులూరు చంద్ర మౌళీశ్వర రెడ్డి died by Lrs.
R5. అయ్యులూరు భాగ్య లక్ష్మి, భర్త లేట్ కృష్ణ రెడ్డి, ఫ్లాట్ నెం.206, మనోజ్ టవర్స్, నియర్ సి.పి.ఎం. ఆఫీసు, ఎన్. జి. ఒ కాలనీ, నంద్యాల, నంద్యాల జిల్లా, ప్రస్తుతం కడప, కడప జిల్లా వగైరాలు ... J.Drs.

ఈ నెంబరు డిక్రీ అమలర్జీని డిక్రీ హెూల్డర్స్ డిక్రీ ప్రకారము అండర్ ఆర్డర్ 26 రూల్ 9 మరియు అండర్ ఆర్డర్ 21 రూల్ 32 సి.పి.సి ప్రకారము కోర్టు ద్వారా కమిషనర్ ను ఏర్పాటు చేసి ఇ. పి. షెడ్యూల్ ను కొలతలు వేసి డిక్రీ హెూల్డర్స్ కు స్వాదీనము చేయుటకు జరిపిన అమలర్జీ పైన ఆర్ 5 కు నోటీస్ పంపిన తీసుకొననందున సదరు అమలర్జీ పైన ఆర్ 5 అయిన నీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట 26-03-2024 వ తేదీన పగలు 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను అట్లు రానంతట నీ పరోక్షమందు తీర్మానింతురు.

కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా డేట్ : 26-03-2024.

ఇట్లు

శ్రీ. వి రామచంద్రరావు గారు,
డిక్రీ హెూల్డర్స్ తరపు అడ్వకేటు,
నంద్యాల, నంద్యాల జిల్లా.

పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు, ఒఎస్‌డి అనిల్‌కుమార్ రెడ్డి

వేగవంతంగా అభివృద్ధి పనులు : కలెక్టర్

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు సూచించారు. ఆ పనులను మంగళవారం కలెక్టర్, ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. ముందుగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇఒ అలవలపాటి ముకుందరెడ్డి, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ పాల్గొన్నారు.

గండి క్షేత్రంలో కొబ్బరి గిన్నెలు వేలం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి క్షేత్రంలో భక్తులు సమర్పించుకునే కొబ్బరి చిప్పలకు వేలంపాట మంగళవారం నిర్వహించారు. వేలం పాటలో కొబ్బరి చిప్పలకు రూ.14,20,516కు జ్ఞానేశ్వర్ నాయుడు, నిత్యాన్నదానం కూరగాయలకు రాసనేని రాణి టెండర్ దక్కించుకున్నారు. తలనీలాలకు సరైన ధర రాకపోవడంతో పాట వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మెన్ కావలి క్రిష్ణతేజ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు కేసరిస్వామి, వేలంపాట దారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నజీర్ అన్నారు. మంగళవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయపోరాట సభలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రతిపేద కుటుంబంలోని మహిళ పేరుతో నెలకు రూ.5000 అందజేస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మేనిఫెస్టోలోని మొదటి వరం ప్రకటికంచారన్నారు. బహిరంగ సభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావశంలో పట్టణ అధ్యక్షులు జీలాన్, మండల అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా సహాయకార్యదర్శి సైమన్ పాల్గొన్నారు.

పేదలకు వరం ఇందిరమ్మ అభయం : పిసిసి

వేంపల్లె : ఇందిరమ్మ ఆభయం పథకం పేదలకు, మహిళలకు కాంగ్రెస్ ఇచ్చిన వరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల శంఖారావంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారన్నారు. దేశంలోని మొదటిసారి ఆంధ్రప్రదేశ్‌లో మహిళ కోసం కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం జరిగిందన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే ఈ పథకం ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.5వేలు ఆర్థికసాయం అందు తుందన్నారు. నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలు ఓట్లు వేయాలని తులసిరెడ్డి కోరారు.

పులివెందుల టౌన్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన శంఖారావం బహిరంగసభ విజయవంతమైనట్లు ఆ పార్టీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, గోగుల రమేష్, శివ, బ్రహ్మ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ పులివెందుల ప్రాంతం నుంచి మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివెళ్లామన్నారు. ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే, రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బహిరంగసభకు రాయలసీమ నుంచి విశేష సంఖ్యలో కార్యకర్తలు తరలి వచ్చారన్నారు. ఖర్గే, షర్మిలారెడ్డి, తులసిరెడ్డి ప్రసంగం ఆకట్టుకుందన్నారు. 2024 ఎన్నికల్లో రాయలసీమలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

మైదుకూరు : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ప్రారంభిస్తూ రక్తదాన ఆవశ్యకతను వివరించారు. రక్త దానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఆర్సి కో-ఆర్డినేటర్ అయ్యావారి రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, రోగగ్రస్తులకు రక్తం అవసరమన్నారు. రక్తదానంలో యువత ముందుకు రావాలన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పివి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యల తలెత్తవని తెలిపారు. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చని సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్ కరిముల్లా విద్యార్థులకు రక్తదానం, సంరక్షణ పద్ధతులు, ప్రయోజనాలను వివరించారు. స్కిల్ హబ్ అధ్యాపకులు శివకేశవ, డాక్టర్ పివి కృష్ణారెడ్డి, విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుభాష్ సాహెబ్, జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి.నరసింహారావు, కమిటీ హెల్త్ సెంటర్ ఐసిటిసి కౌన్సిలర్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ బాషా, ఆరోగ్య సిబ్బంది, అధ్యాపకులు ఎస్.నవనీశ్వర్‌రెడ్డి, చెన్నారాయుడు, అనురాధ, లక్ష్మి, రాధారం, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎపిడి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విధి నిర్వహణలో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం అడిషనల్ పీడీ చల్ల నాగరత్నమ్మ హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని సిబ్బంది ప్రజలకు అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. కూలీలకు వంద రోజులు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ విజిలెన్స్ అధికారి రామాంజనేయరెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, ఎంపిడిఒ సల్మాన్ రాజ్, పిఆర్ ఎఇ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎపిఒ జయభారతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KADAPA

O.S.NO: 111 OF 2021

BEPARI GULAM MAHABOOB, Son of late B.Umar Saheb, Muslim, aged about 75 years, Senior Citizen, residing at Door No: 20/ 219-1, Akula Street, Kadapa city. & 11 OTHERS.

...Petitioners/Plaintiffs

Vs

1) VALIKALA CHINNA VENKATA SUBBAIAH, Son of Valikala Venkata Subbaiah, Hindu, aged about 80 years, Senior Citizen,
2) VALIKALA SREENIVASULU, Son of Valikala Chinna Venkata Subbaiah, Hindu, aged about 54 years,
3) VALIKALA SUBBARAYUDU, Son of Valikala Chinna Venkata Subbaiah, Hindu, aged about 52 years,
Defendants No: 6 to 8 are residing at Door No: 20/ 236, Akula Street, Kadapa city.
4) SYED RANU SAHEB, son of Syed nandyal Khasim Saheb, Muslim, aged about 50 years, Coolie, residing at MruthyunjayaKunta, Kadapa City.

...Defendants No.6 to 8 & 20

SUMMON TO DEFENDANTS NO: 6 TO 8 & 20 UNDER ORDER 5 RULE: 1 & 5 C.P.C

Where as the Plaintiffs herein filed the above suit against you being Defendants for partition and separate possession and said Suit stands posted on 01-03-2024 for the due appearance of DEFENDANTS NO: 6 TO 8 & 20 therefore you being the DEFENDANTS NO: 6 TO 8 & 20 hereby instructed to appear before the Hon'ble court on 01-03-2024 at 10-30 A.M sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE & P. ABBAS KHAN

Advocates for Plaintiffs